# చిగురు

## వి. రాజారామమోహనరావు

మరోసారి అటువేపు చూశాడు సత్యం. యిబ్బందిగా కదుల్తోంది ఆ అమ్మాయి. కొంగుని వీపుమీదకి పదే పదే సర్దుకుంటోంది. ఎంత సర్దుకున్నా అక్కడ, ఆ చోట బలమైన నల్లటి వొళ్ళు నగ్నంగా బైటపడుతూనే వుంది. ఎడంచేతి భుజం కింద, కొంత వీపు మీదకి, కొంత గుండెల వేపుకి చిరిగి వుంది ఆ అమ్మాయి జాకెట్టు. ఆ అమ్మాయి ఎన్ని రకాలుగా సర్దుకున్నా పవిటకొంగు పెద్దగాలేవి ఆ నేతచీర పూర్తిగా ఆ చిరుగుని దాచలేకపోతోంది.

పొద్దున్నించీ అక్కడేవున్న ఆ అమ్మాయివేపు చాలాసార్లు చూశాడు సత్యం. ఒకటి రెండుసార్లు కూచున్న చోటునుంచి లేచి వెళ్ళినా తిరిగి వచ్చి అక్కడే కూచుంది. చేతిలో సంచీ, పక్కనే రేకుపెట్టె, చుట్టూ వున్న జనాన్ని.... హడావిడిని చూట్టంలో బెదురుకూడా సత్యం కళ్ళబడ్డాయి.

షాప్ ముందు జనం రద్దీ ఎక్కువగా వుంటే అంత తీరుబడి వుండదు. కానీ ఆ రోజు అంతగా బేరాల హడావిడి లేకపోవడంవల్ల తీరుబాటుగా వుంది సత్యానికి.

రోజూలాగే పొద్దున్నే అయిదింటికే ఆ రోజు బుక్‌షాప్ తెరవటానికి వచ్చాడు. పొద్దున్నే అయిదు, ఆరు మధ్య వెళ్ళే బస్సులు రెండు మూడు కన్నా ఎక్కువ లేవు. ఆ గంటలో వుండే అమ్మకం అంతంతమాత్రమే. డైలీస్ అమ్మటానికి షాపు తాలూకు కుర్రాడు వేరే వున్నాడు. తనకన్నా ముందే వచ్చి దినపత్రికలన్నీ షాపు దగ్గర కూచుని వాడే అమ్ముతాడు.

అందుకే సత్యం ఒకటి రెండుసార్లు షాపు యాజమానితో అన్నాడు ఆరు తర్వాత వచ్చి షాపు తెరుస్తానని. యజమాని వొప్పుకోడని తెలిసీ అడిగాడు సత్యం అనుకున్నట్టే జరిగింది. 'అయిదింటికే షాపు తెరవాలని.... ఏ బస్సు సేల్స్ పోగొట్టుకోకూడదని' చిన్న వుపన్యాసం యిచ్చాడాయన. ఇచ్చి "ఎంత; వో గంటేగా. ఎలాగో తంటాలుపడు" అన్నాడు.

'పొద్దున్న అయిదింటి దగ్గర్నించి రాత్రి పదిన్నర వరకూ షాప్‌కి కాపలా కాస్తే నాకు తెలుస్తుంది ఆ గంట పని విలువ. మీకేం తెలుస్తుంది లెండి' అనుకున్నాడు సత్యం మనసులో. మధ్యాన్నం ఏదో సమయంలో యజమాని వచ్చి వో అరగంట సత్యాన్ని భోజనానికి వొదులుతాడు. బైటనుంచి పత్రికలు, పేపర్లు, పుస్తకాలు తేవటం కుర్రాడి డ్యూటీ. తను చేసే పదిహేడు గంటల చాకిరీకి రెండువందల జీతం తక్కువని తెలుసు సత్యానికి. కానీ మరో దారేం కనిపించటంలేదు యేడాదిగా అదే షాపుని అంటిపెట్టుకుని రోజులు గడుపు కొస్తున్నాడు. ఇదీ శాశ్వతం కాదు. బుక్ స్టాల్ కంట్రాక్ట్ యింకో యేడాదిలో అయిపోతుంది. తిరిగి టెండర్లు కాల్‌ఫర్ జేస్తారు. యజమాని మంచి పలుకుబడి, డబ్బు వున్నవాడే. తిరిగి కంట్రాక్ట్ తనే సంపాయించుకుంటానని నమ్మకం వున్నా, ఒకోసారి బెదురుగానే వుంటోంది సత్యానికి. తిరిగి పనిగురించి వెతుకులాట, పస్తులు, టీ నీళ్ళతో బన్ ముక్కల్తో బతుకు మనసులో మెదిలినప్పుడల్లా వొళ్లు జలదరిస్తుంది సత్యానికి.

నా అన్నవాళ్ళు చిన్నతనంలోనే కరువైన జీవితం, ఆ పంచనా, ఆ పంచనా వుంటూ, అందరి చిరాకులు, విసుగులు భరిస్తూ ఇంటర్ పూర్తిచేసిన సత్యం, తనకి తాను ఎంతగా నచ్చ చెప్పుకున్నా, పరిస్థితులకి లొంగి బతకటం తప్ప మరో గతేం లేదని నిర్ణయించుకున్నా, అతని యిరవై రెండేళ్ళ మనసు అప్పుడప్పుడు ఎదురుతిరుగుతూనే వుంది.

వొంటరితనం, చిరాకు, బతకటానికి సరైన అవకాశం లేని జీవితం. రోజుకి పదిహేడు గంటల చాకిరీతో మొద్దుబారిపోతున్న శరీరం, ఆలోచన.... వీటన్నిటితో చాలా అసహనంగా వుంటోంది.

ఏ మాత్రం తేడా, ఆసక్తి లేకుండా పొద్దున్నే వొచ్చి కొట్టు తెరిచేటప్పుడు మాత్రం మరీ యిబ్బందిగా వుంటోంది సత్యానికి. షాపు తెరిచాక. ఆ క్షణం గడిచాక అంతా మళ్ళీ రొటీనే. ఆలోచనకి అంతగా అవకాశం లేదు. ఒకటి, రెండుసార్లు కొట్టు తెరుస్తుండగా తాళాలు విసిరికొట్టి ఆ జీవితంనుంచి పారిపోవాలనిపించింది. పుస్తకాలంటే ఎంతో యిష్టం, అభిరుచివున్న సత్యానికి ఆ కొట్టుని తగలపెట్టాలనిపించింది. తన కోపం, అసహనం కొట్టుమీద కాదని, ఆ కొట్టుని అల్లుకుని నిర్దేశించబడిన తన బతుకుమీదని తెలుసు. ఇంతే కాదు యిలాంటి ఆలోచనలు చాలా వచ్చాయి సత్యానికి. 'డబ్బంతా తన చేతిలోనే ఉంటుంది. యజమానికి తనమీద చాలా నమ్మకం వుంది. రోజూ వో పాతికో యాభయ్యో కొట్టేసి డబ్బు దాస్తే...లేదా ఒకే రోజు బాగా అమ్మకం రోజు మొత్తం డబ్బు, వీలున్నన్ని పుస్తకాలు తీసుకుని పారిపోతే;

కానీ ఆ రకం వూహలన్నీ సత్యాన్ని మరింత బాధపెట్టాయి తప్ప, ఏమాత్రం వుపశాంతి నివ్వలేదు

'యీ బతుకుని, యీ షాపుని ఎలా యిష్టపడలేనో, అలాగే వొదులుకోనూ లేను. అందుకే వున్నంతలో ఏదో రకంగా సర్దుకుపోవాలి' అని నిశ్చయానికొచ్చాడు సత్యం. ఆ తర్వాతే చుట్టూ చూట్టం, సాధ్యమైనంతవరకు ఆలోచనని, మనసుని షాపులోంచి

బైటకి జనం అందరూ కూచునే ఆ హాల్లోకి పంపటం అలవాటు చేసుకున్నాడు.

యీ రోజు పొద్దున్నే, ఆ అలవాటుతోటే షాపు తెరుస్తూ చుట్టూ చూశాడు సత్యం. హాలులో రోజూ రాత్రిళ్ళు వొచ్చి పడుకునే అడుక్కునేవాళ్ళు, కూలీలు తప్ప ఎవరూ కనిపించలేదు. గంట గంటన్నర తర్వాత ఆ అమ్మాయి, సంచీ, రేకుపెట్టెతో వొచ్చి కూచుంది. షాపుకి ఎదురుగానే గోడవారగా ఆ అమ్మాయి కూర్చుంటున్నప్పుడే చూశాడు సత్యం. ఆ అమ్మాయితో పాటు, అదే క్షణంలో భుజం కింద చిరుగుని, చిరుగులోంచి మెరుస్తున్న నల్లటి బలమైన వొంటినీ చూశాడు.

ఆ చిరుగువేపు చూసినప్పుడల్లా సత్యం ఆలోచన సన్నటి మంటలా మండుతోంది. ఆ మంట వేడి తన ఇరవై రెండేళ్ళ యవ్వనాన్ని కాలుస్తున్నట్టనిపించింది సత్యానికి.

'పల్లెటూరిది.... అమాయకురాలు. రాత్రి చీకట్లో ఏ గోడ వారగానో పడుకున్నప్పుడు ఎవరో పక్కనచేరి మోటుగా లాంగదీసుకుని వుంటారు. అప్పుడే చిరిగుంటుంది ఆ జాకెట్టు....

'లేదా ఎవరైనా స్టైల్‌తోటి, పల్లెటూరి వాళ్ళకి పట్టణం షోకులమీద ఉండే మోజు ఆసరాతోటి లాంగదీసుకుని ఏ రూమ్‌కో తీసికెళ్ళి వుంటాడు. ఇద్దరి ఆత్రంలో, హడావిడిలో అలా చిరిగి ఉంటుంది....'

ఇలా ఆ చిరుగు గురించిన ఆలోచన



అనేక రకాలుగా, అనేక రంగుల్లో సత్యంలో కదుల్తూనే వుంది. బైట చీకటి పెరిగి, హాల్లో లైట్లు వెలిగే సమయానికి సత్యం ఆలోచన యించుమించు కోరిగ్గా మారిపోయింది.

'పొద్దున్నించీ యిక్కడే వుందంటే, యింక యీ రాత్రికూడా యిక్కడే వుంటుంది. ఎలాగేనా ప్రయత్నం చెయ్యాలి' అనుకున్నాడు సత్యం.

అలా అనుకోగానే తన ఒంటరిగది, ఆ అమ్మాయి బలమైన నల్లటి వొళ్ళు. చేరువ....వూహలో మెదిలి వొళ్ళంతా వొక్కసారి వొణికింది సత్యానికి. కోరిక వేడి సన్నగా వొణుకుతూ తన లోలోపల కలయతిరుగుతున్నట్టనిపించింది. యజమాని వూళ్ళో లేకపోవటంతో ఎప్పుడెప్పుడు కొట్టు కట్టేద్దామా అనిపించింది సత్యానికి.

* * *

అయిదు నిముషాల ముందు చూశాడు సత్యం ఆ అమ్మాయివేపు. అప్పుడు ఒంటరిగానే వుంది. కానీ యిప్పుడు పక్కనే కూచున్న ఎవరితోనో మాట్లాడుతోంది. మోకాళ్ళమీద బిగుతుగా పంచ, గుడ్డ బనీను....తలకి తుండు....ఎవరో పల్లెటూరి మనిషి....పక్కనే గొంతు కూచుని, ఆ అయిదు నిముషాల్లోనే చాలా చనువుగా మాట్లాడేస్తున్నాడు.

అది చూసిన సత్యం వుత్సాహం పూర్తిగా చప్పబడిపోయింది. తనకన్నా ముందే ఎవరో ఆ అమ్మాయి దగ్గర చేరటంతో ఏంచెయ్యాలో తోచలేదు. 'వాడికన్నా ముందు తనే వెళ్ళి మాట కలిపి వుండాల్సింది,' అనుకున్నాడు.

'రూమ్‌కి వొస్తుంది. యిద్దరు కలిసి గడుపుతారు. ఏ ఆసరాలేని ఆ అమ్మాయి యింత వొండిపెడుతూ తనతోటే వుండిపోతానంటే....' అంతకు ముందు ఇలా సాగిన సత్యం వూహలన్నీ తల్లకిందులయ్యాయి.

ఆశ చావక, నెమ్మదిగా లేచి కొట్టు దాటి ఆ అమ్మాయి వున్నవేపు నడిచాడు.

'ఆ పక్క మనిషి ఎవరో బస్సెక్కటానికి వొచ్చుంటాడు. ఏం తోచక వూరికే కబుర్లలో పడ్డారేమో.....అలా అయితే ఎంతబావుణ్ణు....' అనుకున్నాడు సత్యం.

బెరుకు, బెరుగ్గానే వాళ్ళద్దరికీ కొంచెం దూరంగా, వాళ్ళ మాటలు వినిపించేంత దగ్గరగా నిలబడ్డాడు.

"అదేటి మావా....రోజంతా కూలి చేసినా మూడు రూపాయలేనా కూలి...." అంది అమ్మాయి.

"ఏమోనే యిక్కడి గొడవ మన కేం తెలుసు. ఊరు సంగతి తెలిసే దాకా యీ బాధ తప్పదు. కూలిమాట ఎలా వున్నా ముందెక్కడేనా తలదాచుకోటానికి వో గుడిసె చూసుకోవాలి. రేపు నే పనికెళ్ళేటప్పుడు నువ్వు నాతోటే రా. యిక్కడిలా వొంటరిగా వొద్దు...." అన్నాడు.

ఆ తర్వాత వాళ్ళ మాటల్లో చాలా విషయాలు తెలిశాయి సత్యానికి. బతుకు తెరువుకోసం పల్లె వొదిలి పట్నం వచ్చిన ఆ మొగుడూ పెళ్ళాల యిబ్బందులు, భయాలు, ఆప్యాయతలు...యింక సత్యం వెనక్కి తిరిగి వొచ్చేయబోతూంటే ఆ అమ్మాయి అన్న ఆ మాట సత్యం చెవిన బడింది.

"మావా! వున్న యీ ఒక్క రవిక కూడా పిగిలిపోయింది. కొంగు ఎంత కప్పుకున్నా కుదరటంలేదు. సిగ్గుతో ఒళ్ళు చితికిపోతోంది"

ఇంక వినలేకపోయాడు సత్యం. గబగబా వెనక్కి వచ్చేశాడు.

మనసు మొద్దుబారినట్టనిపించింది. కోరిక తీరనందుకు కాదు, ఆ కోరిక తనలో తలెత్తినందుకే యిబ్బందనిపించింది సత్యానికి

ఎదురుగా వాళ్ళిద్దరూ యింకా అలా కూచుని మాట్లాడుకుంటూనే వున్నారు. ఆ విశాలమైన హాల్లో, అందరి జనం మధ్య ఆ చిరుగు సత్యానికి కనిపిస్తూనే వుంది.

తన లోలోపల మెలితిరుగుతున్న బాధకి మూలమేమిటో అర్థం అయ్యేవరకు చాలా అసహనంగా గడిచింది సత్యానికి.

అర్థం అయ్యాక ఆ చిరుగుని చూసి వుద్రేకపడిన తన వయసుని తిట్టుకోలేదు సత్యం. చిరుగుని, ఆ పేదరికం చిరుగుని సరిగ్గా వూహించే ప్రయత్నమేనా చెయ్యలేకపోయిన తన పరిస్థితిని, తిట్టుకున్నాడు సత్యం.

